సాక్షి ఖమ్మం

మంగళవారం ၊ 7 ၊ ఫిబ్రవరి ၊ 2023



బడులకు మహర్దశ

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పీఎం శ్రీ' పథకానికి ఎంపికయ్యే ప్రభుత్వ పాఠశాలలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందనున్నాయి. 10లో



నిష్పక్షపాతంగా విచారణ జరపాలి

ప్రభుత్వ రంగ సంస్థల నిధుల పెట్టుబడులపై విచారణ నిష్పక్షపాతం జరిపించాలంటూ కాంగ్రెస్ ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
35°/ 17°

వాతావరణం

మంగళవారం జిల్లాలో మధ్యాహ్న ఉష్ణోగ్రత పెరిగే అవకాశముంది. ఉదయం అక్కడక్కడా మంచు ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న కార్యదర్శి రమణకుమార్

ఏన్కూరు: గురుకులాల విద్యార్థులు రానున్న ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి రమణకుమార్ సూచించారు. ఏన్కూరులోని గురుకుల విద్యాలయాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, హాస్టల్, క్రీడాప్రాంగణాలు, భోజనాన్ని పరిశీలించి ఉద్యోగులకు సూచనలిచ్చారు. ఆ తర్వాత విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించిన ఆయన ఉత్తమ ఫలితాలు సాధించేలా కష్టపడాలని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ పరీక్ష ఫీజు చెల్లింపునకు అవకాశం

ఖమ్మం సహకారనగర్: ఎస్సెస్సీ వార్షిక పరీక్ష ఫీజును అపరాధ రుసుముతో చెల్లించేందుకు ఈనెల 15వ తేదీ వరకు అవకాశముందని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఇప్పటి వరకు పరీక్ష ఫీజు చెల్లించని వారు రూ.వెయ్యి అపరాధ రుసుముతో చెల్లించేందుకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు, రేపు అప్పీళ్ల స్వీకరణ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సీనియారిటీ జాబితాను మంగళవారం ఆన్‌లైన్‌లో పొందుపర్చనున్నట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఈ జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే తగిన ధృవపత్రాలతో మంగళ, బుధవారాల్లో ఆన్‌లైన్‌లో అప్పీల్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కాగా, 2015నుంచి 2018వరకు స్పౌజ్ కేటగిరి, ప్రాధాన్యత కేటగిరీలను ఉపయోగించుకుని ఎనిమిదేళ్లు పూర్తి కాకుండానే మళ్లీ ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఈఓ వెల్లడించారు.

92,140 మందికి కంటి పరీక్షలు పూర్తి

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం శరవేగంగా జరుగుతోంది. గత నెల 18న కార్యక్రమం ప్రారంభం కాగా సోమవారం వరకు జిల్లాలో 92,140 మందికి కంటిపరీక్షలు చేశారు. ఇందులో 24,036 మందికి రీడింగ్ గ్లాసులు అందజేయగా, ప్రిస్కిప్షన్ గ్లాసులు 15,133 మందికి అవసరమని గుర్తించారు. వీరిలో 12,106 మందికి త్వరలోనే అద్దాలు అందుతాయని డీఎంహెచ్ఓ మాలతి తెలిపారు.

ధాన్యం నగదు రూ.39కోట్లు విడుదల



ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుండి సేకరించిన ధాన్యం చెల్లింపుల నిమిత్తం సోమవారం రూ.39 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ విషయాన్ని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 42,101 మంది రైతుల నుండి రూ.573.87 కోట్ల విలువైన 2,88,618.760 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని పేర్కొన్నారు. ఇప్పటికే 31,241 మంది రైతులకు రూ.422.47 కోట్లను చెల్లించగా, మిగిలిన వారి ఖాతాల్లో రెండు, మూడు రోజుల్లోగా నగదు జమ చేస్తామని తెలిపారు.

నిధుల వరద!

సాగునీటి ప్రాజెక్టులకు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రాధాన్యత

- ఉమ్మడి జిల్లాలోని సీతారామకు రూ.963 కోట్లు
- ఖమ్మంలో మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కళాశాల
- జిల్లాలో దళితబంధు కింద ఎస్సీలకు లబ్ధి
- మున్సిపాలిటీలకు పట్టనున్న మహర్దశ



సీతారామ ప్రాజెక్టు (ఫైల్)

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అభివృద్ధి అజెండాగా పేర్కొన్న రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాలోని పలు రంగాలకు పెద్దపీట వేశారు. సాగునీటి ప్రాజెక్టులకు నిధుల తోపాటు మున్సిపాలిటీలు, దళితబంధు, పంచాయతీలకు నిధులు దండిగా కేటాయించనున్నట్లు ప్రకటించారు. అలాగే, జిల్లాలోని అంతర్గత రహదారులు కూడా రూపురేఖలు మారే అవకాశం ఉంది. ఇక రైతుల రుణమాఫీ అంశాన్ని సైతం బడ్జెట్‌లో ప్రస్తావించారు. జిల్లాలోని 589 పంచాయతీ ఖాతాల్లో నేరుగా జమ చేయాలనే నిర్ణయాన్ని ప్రకటించారు. మొత్తంగా శాసనసభలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను పరిశీలిస్తే వచ్చే ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని పలు రంగాలు అభివృద్ధి బాట పట్టనున్నాయి.

నీటి పారుదలకు నిధులు..

రాష్ట్రప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు తర్వాత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వరప్రదాయినిలా మారే సీతారామ ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లోనూ భారీగానే నిధులు కేటాయించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆరున్నర లక్షల ఎకరాలకు నీరు అందించే సీతారామ ఎత్తిపోతల పథకానికి రూ.963 కోట్లు కేటాయించగా.. ఈ నిధులతో బ్యారేజ్, ఫ్లడ్ కెనాల్, నిర్వాసితులకు పరిహారం, కాల్వలు, పంప్‌హౌస్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా ఉమ్మడి జిల్లా ప్రజలకు సాగునీరు అందివ్వడంతో పాటు నాగార్జున సాగర్ ఎడమ కాల్వకింద ఉన్న ఆయకట్టును స్థిరీకరించాలనేది లక్ష్యం. అలాగే, 320 మెగావాట్ల జల విద్యుత్ కూడా ఈ ప్రాజెక్టు నుంచి ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. దీంతో గత బడ్జెట్‌లో సీతారామ ప్రాజెక్టుకు రూ.998 కోట్లు ప్రకటించి రూ.769.64 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.963 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఇక భక్తరామదాసు ఎత్తిపోతల పథకం నిర్వహణ, సత్తుపల్లి నియోజకవర్గంలోని లంకాసాగర్ ప్రాజెక్టు, వైరా ప్రాజెక్టు, చర్ల మండలంలోని తాలిపేరు తదితర ప్రాజెక్టులకు కూడా నిధులు కేటాయించారు.

కదిలిన రుణమాఫీ

రైతులకు రూ.90 వేల వరకు ఉన్న రుణాలను మాఫీ చేస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. జిల్లాలో 3.25 లక్షల మంది రైతులు ఉండగా.. ఇందులో 37,371 మంది రైతులకు మాత్రమే రూ.79.96 కోట్ల మేర రుణమాఫీ అయింది. ఇంకా జిల్లాలో రూ.2,348.40 కోట్లు రుణమాఫీ కావాల్సి ఉంది. బడ్జెట్‌లో ప్రకటించినట్లుగా ఈ రైతుల్లో సుమారు 2 లక్షల మందికి రూ.90వేల వరకు రుణమాఫీ కానుంది. అలాగే, వచ్చే వానాకాలం, యాసంగి సీజన్లలో అర్హులైన రైతులకు రైతుబంధు ద్వారా పెట్టుబడి సాయం అందనుంది. ఇక ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు గాను ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లను కేటాయించింది. రాష్ట్రంలోనే ఆయిల్‌పామ్ సాగులో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రథమస్థానంలో ఉన్న నేపథ్యాన.. ప్రభుత్వం సహకారంతో సాగు మరింత పెరుగుతుంది.

మిగిలిన కుటుంబాలకూ దళితబంధు

జిల్లాలోని చింతకాని మండలాన్ని దళితబంధు పథకం అమలుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఇప్పటికే ఈ ఈ మండలంలో సుమారు 3,500 కుటుంబాలకు దళితబంధు ద్వారా లబ్ధి కలిగింది. అలాగే జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఒక్కొక్క నియోజకవర్గానికి 500 మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేశారు. తాజా బడ్జెట్‌లో దళితబంధుకు రాష్ట్రవ్యాప్తంగా రూ.17,500 కోట్లు కేటాయించడంతో జిల్లావ్యాప్తంగా ఐదు నియోజకవర్గాల్లో 70 వేల కుటుంబాలు అర్హులుగా ఉన్నట్లు గుర్తించిన నేపథ్యాన వీరికి పథకం ద్వారా లబ్ధి జరగనుంది.

బాగుపడనున్న రోడ్లు

గ్రామాల నుంచి మండల కేంద్రాలకు వెళ్లే రోడ్లు జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో పలు చోట్ల అధ్వానంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్లు మరింతగా దెబ్బతిన్నాయి. అయితే నిధులు లేమితో ప్యాచ్ వర్క్‌లతోనే రహదారులు భవనాల శాఖ సరిపెడుతోంది. ప్రస్తుత రూ.2,500 కోట్లు బడ్జెట్‌లో రాష్ట్రవ్యాప్తంగా రోడ్లకు కేటాయించిన నేపథ్యాన, జిల్లాలోని రోడ్ల రూపురేఖలు మారనున్నాయని భావిస్తున్నారు.

సొంత జాగా ఉంటే రూ.3 లక్షలు

ప్రభుత్వం గతంలో ప్రకటించినట్లుగా సొంత జాగా ఉన్న వారికి ఇళ్ల నిర్మాణం కోసం రూ.3లక్షలు మంజూరు చేయనున్నారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించినా అర్హులందరికీ దక్కలేదనే ఆవేదన ఉంది. కొన్నిచోట్ల నిర్మాణాలు మధ్యలో నిలిచిపోగా, మరికొన్ని చోట్ల పూర్తయినా కేటాయించలేదు. ఈ నేపథ్యాన డబుల్ బెడ్ రూమ్ అందని వారిలో సొంత స్థలం నిరుపేదలను ఈ పథకం కింద గుర్తిస్తారు.

పల్లె, పట్నానికి పట్టం

ఖమ్మం కార్పొరేషన్‌కు గత బడ్జెట్‌లో చూపించినట్లుగానే ఈ బడ్జెట్‌లోనూ కూడా రూ.10 కోట్లు కేటాయించారు. ఇక జిల్లాలోని వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీలకు కూడా నిధులు దండిగా వచ్చే అవకాశం ఉంది. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మం పర్యటన సందర్భంగా ఒక్కో మున్సిపాలిటీకి రూ.30 కోట్లు ప్రకటించిన విషయం విదితమే. ఇవి సీఎం హామీల కింద రానుండగా.. రాష్ట్ర బడ్జెట్‌లో మున్సిపాలిటీలకు కేటాయించే నిధులతో హంగులు సమకూరనున్నాయి. ఇవే కాక జిల్లాకు ప్రకటించిన మెడికల్ కళాశాలలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాలలను మంజూరు చేస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు.

నీటి పారుదల ప్రాజెక్టులకు గత ఏడాది, ఈ ఏడాది కేటాయింపులు

ప్రాజెక్టు	2022-23	2023-24
సీతారామ	రూ.769.64 కోట్లు	రూ. 963.44 కోట్లు
భక్తరామదాసు	రూ.1.57 లక్షలు	రూ.40.56 లక్షలు
లంకాసాగర్	రూ.8.46 కోట్లు	రూ.13.69 కోట్లు
వైరా	రూ.కోటి	రూ.99లక్షలు
బయ్యారం లిఫ్ట్	రూ.20 లక్షలు	రూ.లక్ష
తాలిపేరు	రూ.80 లక్షలు	రూ.5.24 కోట్లు
పెద్దవాగు	రూ.25 లక్షలు	రూ.5లక్షలు

అన్ని వర్గాలకు సమప్రాధాన్యం



రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆకాంక్షలు, ఆలోచనలకు అనుగుణంగా ఉంది. కేటాయింపుల్లో అన్నివర్గాలకు ప్రాధాన్యత దక్కింది. రైతుబంధుకు నిధులు, రుణమాఫీపై ప్రకటనతో వ్యవసాయానికి పెద్దపీట వేసినట్లయింది. నగరం, పట్టణం, పల్లె మెరిసేలా నిధులు కేటాయించడం సీఎంకేసీఆర్ దార్శనికతకు నిదర్శనం.

– నామ నాగేశ్వరరావు, ఎంపీ, లోక్‌సభా పక్ష నేత

జనరంజక బడ్జెట్..



ఈ బడ్జెట్ ప్రజల ఆశలు, ఆశయాలను పూర్తి స్థాయిలో నెరవేరుస్తుంది. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ సుపరిపాలన అందిస్తున్నారని చెప్పడానికి బడ్జెట్ మరో ఉదాహరణ. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కాకుండా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌కు నిధులు కేటాయించడం సంతోషంగా ఉంది.

– వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు

ప్రగతి బడ్జెట్..



నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం, రైతులకు వెన్నుదన్నుగా నిలిచేలా ఈబడ్జెట్‌లో నిధులు కేటాయించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. రహదారులు, మున్సిపాలిటీలు కేటాయించిన నిధులతో జిల్లాలో అభివృద్ధి శరవేగంగా సాగుతుంది. దళితబంధు నిధులతో ఆయా వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుంది.

– సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్యే, సత్తుపల్లి

సమస్యల పరిష్కారానికి చొరవ

గ్రీవెన్స్‌లో కలెక్టర్ గౌతమ్



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంసహకారనగర్: జిల్లా నలుమూలల నుంచి వచ్చి వినతులు, ఫిర్యాదులు ఇచ్చే ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చొరవ తీసుకోవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన గ్రీవెన్స్ డే సందర్భంగా దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమావేశమైన దరఖాస్తులపై పరిష్కారంపై సూచనలు చేశారు. అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్, డీఆర్వో శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- కూసుమంచి మండలం చేగొమ్మకు చెందిన పోటు పెంటయ్య చేగొమ్మ రెవెన్యూ పరిధి 67లో సర్వేనంబర్‌లో తనకు ఉన్న భూమి ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని ఫిర్యాదు చేశాడు.
- కామేపల్లి మండలం ముచ్చర్లకు చెందిన తీర్థాల సూర్యనారాయణ ముచ్చర్ల రెవెన్యూ పరిధిలో తన తండ్రి నుంచి వాటా ఇప్పించాలని కోరాడు.
- కూసుమంచి మండలం సుంగల్ తండాకు చెందిన తేజావత్ రమేష్ తెల్లరేషన్ కార్డు ఇప్పించాలని, ఖమ్మం మామిళ్లగూడెంకు చెందిన వితంతువు అనుగోజు హిమబిందు ఇంటి స్థలం లేదా డబుల్ బెడ్‌రూం ఇళ్లు, చింతకాని మండలం లచ్చగూడెంకు చెందిన షేక్ ఖాసింసాహెబ్ తనకు ఆసరా పింఛన్ ఇప్పించాలని కోరాడు.
- రేగులచెలకలో సర్వే నంబర్ 228లోని 0-27 కుంటల తాగునీటి బావి స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడాలని సర్పంచ్ కె.రామారావు విన్నవించాడు.

లోక్ అదాలత్‌లో రాజీపడితే వడ్డీ మాఫీ

ఖమ్మంలీగల్: రుణ బకాయి, చెక్ కేసులను లోక్ అదాలత్‌లో రాజీ పడితే పూర్తి వడ్డీ మాఫీ అమలుచేస్తామని చిట్‌ఫండ్, ఇతర ఆర్థిక సంస్థల ప్రతినిధులు తెలిపారు. ఈనెల 11న జాతీయ లోక్ అదాలత్ జరగనున్న నేపథ్యాన జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు సోమవారం చిట్‌ఫండ్, ఆర్థిక సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ చెక్‌బౌన్స్ కేసుల్లో మూడు వాయిదాల తర్వాత రాజీపడితే కొంత పరిహారం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అయితే ఫిబ్రవరి 11లోపు రాజీ అయ్యే కేసుల్లో ఈ మొత్తాన్ని రద్దుచేసే అవకాశం ఉందని పేర్కొనగా... ఆర్థిక సంస్థల ప్రతినిధులు వడ్డీ మాఫీకి అంగీకరించారు. ఈ సమావేశంలో న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావేద్‌పాషా, న్యాయవాదులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు



మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్, పక్కన కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్, మేయర్ నీరజ

- ఆర్థిక మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా పంపిణీ
- ఈనెల 10న జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన
- రాష్ట్ర రవాణా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు ఇళ్లస్థలాల పంపిణీకి మార్గం సుగమమైందని.. ఈనెల 10న లేదా అసెంబ్లీ సమావేశాల తర్వాత ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావుతో చేతుల మీదుగా స్థల పత్రాలు పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతనెల 18న సీఎం కేసీఆర్ ఖమ్మం వచ్చిన సందర్భంగా నెల వ్యవధిలోనే జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇచ్చిన హామీమేరకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతీ జర్నలిస్టుకు 200గజాల మేర ఇచ్చేందుకు ఇప్పటికే స్థలాలను గుర్తించి కలెక్టర్, సంబంధిత అధికారులతో సమీక్షించామని తెలిపారు. స్థల పత్రాల పంపిణీకి మంత్రి హరీశ్‌రావు హాజరవుతారని పేర్కొన్నారు. కాగా, రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఈనెల 10న జిల్లా కేంద్రానికి వచ్చే అవకాశం ఉందని.. ఆయన పర్యటన నేపథ్యంలో ఖమ్మం వీడీవోస్ కాలనీలో రూ.6.50 కోట్లతో నిర్మించిన వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్, అల్లీపురంలో రూ.2 కోట్లతో నిర్మించిన వైకుంఠధామంను ప్రారంభిస్తారని పువ్వాడ తెలిపారు. ఇంకా వాడవాడకు పువ్వాడ కార్యక్రమంలో భాగంగా రూ.32 కోట్లతో చేపట్టనున్న పనులకు సంబంధించి శంకుస్థాపనలు చేస్తారని వెల్లడించారు. ఇంకా ఈ సమావేశంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, ఖమ్మం కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ ఆదర్శ్ సురభి, సుడా చైర్మన్ బచ్చు విజయ్ పాల్గొన్నారు.

కట్టడికి కదిలిన బీఆర్‌ఎస్

- పొంగులేటి వర్గానికి చెక్ పెట్టేలా పావులు
- నేడు వైరా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమావేశం
- మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం దిశగా కసరత్తు
- ఈనెల 13న ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుకు మాజీ ఎంపీ టీమ్ అడుగులు

వైరా: వైరా నియోజకవర్గంలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గీయులను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ బీఆర్‌ఎస్ నేతలు ప్రకటన విడుదల చేయగా, ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి. పొంగులేటి వెంట నడుస్తున్నారని నియోజకవర్గంలోని 26 మంది బీఆర్‌ఎస్ నేతలపై ఆదివారం సస్పెన్షన్ వేటు వేసిన విషయం విదితమే. ఇక వరుసగా నియోజకవర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్న పొంగులేటి వర్గం.. ఈనెల 13న వైరా నియోజకవర్గ స్థాయి సమ్మేళనానికి ఏర్పాటుచేస్తుండడంపై బీఆర్‌ఎస్ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించింది. పొంగులేటి వెంట ఎవరు వెళ్లకుండా కట్టడి చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

నేడు క్యాంపు కార్యాలయంలో భేటీ

మాజీ ఎంపీ శ్రీనివాసరెడ్డి వెంట నడుస్తున్నారని చెబుతూ ఇప్పటికే పలువురిని సస్పెండ్ చేయగా... మిగిలిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ముఖ్య నాయకులను 13న జరిగే సమ్మేళనానికి వెళ్లకుండా కట్టడికి యత్నాలు మొదలుపెట్టారు. ఈక్రమంలో మంగళవారం వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే రాములునాయక్ ఈ సమావేశంలో పాల్గొంటారని నియోజకవర్గ ముఖ్యనాయకులకు సమాచారం చేరవేశారు.

చైర్మన్‌పై అవిశ్వాసానికి పావులు

వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ కూడా పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంట నడుస్తుండడంతో ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అంతేకాక చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు పార్టీ జిల్లా నాయకత్వం రాష్ట్ర పెద్దలతో చర్చించినట్లు సమాచారం. ఇక మరికొందరు నేతలు హైదరాబాద్ వెళ్లి మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాల్సిందేనని మంత్రులను కలిసినట్లు తెలిసింది. ఈ నేపథ్యాన కొందరు మున్సిపల్ కౌన్సిలర్లతో ఎమ్మెల్యే రాములు నాయక్ మాట్లాడినట్లు తెలుస్తుండగా, మంగళవారం జరగనున్న సమావేశంలో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశముందని సమాచారం.

ముందుకెళ్లేదెలా?

వైరా మున్సిపాలిటీలో 20 మంది కౌన్సిలర్లకు గాను బీఆర్‌ఎస్ 15 వార్డులను దక్కించుకుంది. ఇక కాంగ్రెస్ రెండు, ఇండిపెండెంట్లు రెండు, సీపీఎం ఒక వార్డులో గెలవగా, ఇండిపెండెంట్లు ఇద్దరు, సీపీఎం సభ్యుడు బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో టీఆర్‌ఎస్ సంఖ్యా బలం 18కి చేరింది. ఇలా బీఆర్‌ఎస్‌కు బలం ఉన్న నేపథ్యాన అవిశ్వాస తీర్మానంపై ఎలా ముందుకెళ్లాలనే అంశంపై పార్టీ జిల్లా నాయకత్వం చర్చిస్తున్నట్లు తెలుస్తోంది.

వేచిచూసే ధోరణి

మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం తీర్మానం పెడితే ఎలా ముందుకెళ్లాలన్న అంశంపై పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గం వేచిచూసే ధోరణి అవలంబిస్తున్నట్లు తెలుస్తోంది. కౌన్సిలర్లలో ఎవరెవరు అవిశ్వాసానికి మద్దతు ఇస్తారు, ఎందరు తమ వెంట నడుస్తారనే అంశంపై కసరత్తు చేస్తూనే... ఈనెల 13న ఆత్మీయ సమ్మేళనాన్ని భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లలో నిమగ్నమైనట్లు సమాచారం.

ప్రజలకు ఈ అంకెలు అవసరం లేదు...

రాష్ట్ర మాజీ మంత్రి ఈటల రాజేందర్

ఖమ్మం మామిళ్లగూడెం: సామాన్య ప్రజలకు ఈ బడ్జెట్, అంకెలేవీ అవసరం లేదని.. వారికి కావాల్సిందల్లా సకాలంలో పింఛన్, దవాఖానాల్లో మెరుగైన వైద్యం మాత్రమేనని రాష్ట్ర మాజీ ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఖమ్మంకు చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ శీలం పాపారావు తల్లి లక్ష్మి ఇటీవల మృతి చెందగా, ఆమె కుటుంబీకులను సోమవారం రాత్రి ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రిటైర్డు ఉద్యోగులకు జీపీఎఫ్ ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ ప్రభుత్వానికి హామీలు అమలుచేసే సత్తా ఉందా, లేదో చెప్పాలని సూచించారు. రుణ మాఫీ, పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని, కాంట్రాక్టు ఉద్యోగులకు ఆరు నెలలకోసారి జీతాలు ఇస్తున్నారని ఆరోపించారు. దళిత, గిరిజనుల సంక్షేమానికి రూ.కోట్లలో లెక్కలు చూపిస్తున్నా ఖర్చు పెట్టడం లేదని, ఆర్టీసీని బ్రహ్మ దేవుడు కూడా కాపాడలేడని కేసీఆర్ అన్నట్లుగానే అతి తక్కువ బడ్జెట్ ఇచ్చారని మండిపడ్డారు. కాగా, హామీలన్నింటినీ విస్మరించిన బీఆర్‌ఎస్‌ను ఓడించడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారని రాజేందర్ చెప్పారు. ఈకార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు పిట్టల వెంకటనర్సయ్య, పతానపు వెంకటేశ్వర్లు, గోపగాని శంకర్‌రావు, కొప్పెర వెంకటనర్సయ్య, రావుల హన్మంతరావు, కొప్పెర జానకీరాములు, నర్ల శ్రీనివాసరావు, సైదులు, నర్ల శేషయ్య, ఉద్యమకారులు డోకుపర్తి సుబ్బారావు, పాలకుర్తి కృష్ణ, బురాన్, పగడాల నరేందర్, బీజేపీ నాయకులు దీకొండ శ్యాం, శ్రీని వాస్, అంకిత పాపారావు, రాజేష్, ఈదుల భద్రం తదితరులు పాల్గొన్నారు. కాగా, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం బాధ్యులు ఈటలను కలిసి తమకు ప్రభుత్వం నుంచి శిక్షణతో పాటు సర్టిఫికెట్లు ఇప్పించేలా కృషి చేయాలని కోరారు.



పాపారావు తల్లి చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న ఈటల రాజేందర్

క్లుప్తంగా

కిరాణ షాపులో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ



నోటీసు జారీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలో గడువు తీరిన చిప్స్ ప్యాకెట్లు అమ్ముతున్న కిరాణ షాపులో జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కిరణ్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. 'సాక్షి'లో సోమవారం 'చిప్స్ చింత' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన బుర్హాన్‌పురంలోని నాగుబండి కోటేశ్వరరావుకు చెందిన వాసవీ కిరాణం దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా కాలం చెల్లిన బింగో చిప్స్ ప్యాకెట్లు తొమ్మిందిటిని స్వాధీనం చేసుకుని, యజమానికి నోటీసులు జారీ చేశారు. గడువు ముగిసిన పదార్థాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాటుసారా విక్రేతకు రూ.లక్ష జరిమానా

ఏన్కూరు: మండలంలోని అక్కినాపురం తండాకు చెందిన వాంకుడోతు రత్న నాటుసారా విక్రయిస్తుండగా రూ.లక్ష జరిమానా విధించారు. గత అక్టోబర్‌లో రత్న సారా అమ్ముతూ పట్టుబడగా ఎక్సైజ్ అధికారులు బైండోవర్ చేశారు. అయితే, తీరు మార్చుకోకుండా మళ్లీ సారా అమ్మడంతో తహసీల్దార్ ఎదుట సోమవారం హాజరుపర్చగా రూ.లక్ష జరిమానా విధించినట్లు కారేపల్లి ఎక్సైజ్ సీఐ జెల్సికర్ అహ్మద్, ఎస్సై రమణ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని కరుణగిరి వద్ద సోమవారం ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో మండలంలోని ఆరేకోడుకు చెందిన కేసనపల్లి శ్రీకాంత్(41) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న శ్రీకాంత్ సోమవారం ఉదయం ద్విచక్రవాహనంపై పాఠశాలకు వెళ్తుండగా కరుణగిరి వద్ద వెనుక నుండి వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనం పైనుండి ఎగిరిపడిన ఆయన తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, రోడ్డు మధ్యలో ద్విచక్ర వాహనం, మృతదేహం పడి ఉండటంతో ట్రాఫిక్ నిలిచిపోగా పోలీసులు చేరుకుని రాకపోకలు క్రమబద్ధీకరించారు. శ్రీకాంత్ తండ్రి మురళయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

అమెరికాలో గన్ మిస్‌ఫైర్

జిల్లా విద్యార్థి పరిస్థితి విషమం



అఖిల్‌సాయి (ఫైల్)

మధిర: భారత కాలమాన ప్రకారం సోమవారం ఉదయం 11 గంటల సమయాన అమెరికాలో గన్ మిస్‌ఫైర్ కాగా.. ఖమ్మం జిల్లా మధిరకు చెందిన విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. మధిరకు చెందిన మహంకాళి ఉమాశంకర్ – మాధవి దంపతులు కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో కిరాణా షాపు నడుపుతున్నారు. వీరి పెద్ద కుమారుడు అఖిల్ సాయి (23) ఉన్నత విద్య కోసం అమెరికాలోని అలబామాకు గత ఏడాది వెళ్లాడు. చదువుకుంటూనే ఒక మార్ట్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తుండగా.. అక్కడి సెక్యూరిటీ గార్డు వద్ద ఉన్న తుపాకీ మిస్‌ఫైర్ కావడంతో అఖిల్‌సాయికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుండగా, ఈ విషయమై ఆయన తల్లిదండ్రులకు సమాచారం అందడంతో ఆందోళన చెందుతున్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

నేలకొండపల్లి: అదనపు కట్నం కోసం చిత్రహింసలు పెడుతున్న భర్తపై బాధితురాలి ఫ/ ర్యాదు మేరకు నేలకొండపల్లి పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మండలంలోని సదాశివాపురానికి చెందిన మౌనికతో ఖమ్మం ప్రకాష్‌నగర్‌కు చెందిన రవివిష్ణుకుమార్‌తో 2020లో వివాహమైంది. కొంత కాలం సంసారం సాఫీగానే సాగగా, ఆతర్వాత విష్ణుకుమార్ మద్యం తాగొచ్చి మౌనికను సిగిరెట్లతో కాలుస్తూ చిత్రహింసలకు గురిచేయడమే కాక అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడు. ఆయనకు మిగతా కుటుంబం కూడా సహకరిస్తుండడంతో బాధితులను పోలీసులను ఆశ్రయించింది.

డీజిల్ డబ్బాతో మహిళ హల్‌చల్

పినపాక: అకారణంగా తన భర్తను సస్పెండ్ చేశారని పినపాక ఎంపీడీఓ కార్యాలయం సీనియర్ సహాయకులు మోహన్‌రెడ్డి భార్య మండల పరిషత్ కార్యాలయంలో డీజిల్ డబ్బాతో హల్‌చల్ చేశారు. సోమవారం కార్యాలయానికి తన భర్త చేరుకున్నా విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఇచ్చిన లేఖను అందజేసేందుకు వచ్చిన కార్యాలయ అటెండర్ కూడా అసభ్యకరంగా మాట్లాడారని, లేఖ తీసుకోని పక్షంలో ఇంటిని సీట్ చేస్తామని ఎంపీడీఓ ఆదేశించారని ఆమె ఆరోపించారు. అకారణంగా తొలగించిన తన భర్తను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బడులకు మహర్దశ

- సీఎం శ్రీ' కోసం ప్రతిపాదనలు
- జిల్లా నుంచి 42పాఠశాలలకు అవకాశం
- ఎంపికైతే ఐదేళ్ల పాటు నిధుల మంజూరు



ఖమ్మం రూరల్ మండలం కాచిరాజుగూడెంలో పాఠశాలలో వివరాలు సేకరిస్తున్న బృందం (ఫైల్)

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో మరిన్ని వసతులు కల్పించేందుకు పీఎం శ్రీ(ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకానికి కేంద్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు విద్యార్థులు, విద్యార్థి సంఘాల నుంచి కనీస సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్ వస్తుండగా.. కనీస వసతులే కాదు ఈ పథకం ద్వారా అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు కేంద్రప్రభుత్వం చెబుతోంది. ఈ పథకం కింద మంజూరయ్యే పాఠశాలలకు ఐదేళ్ల పాటు నిధులు మంజూరు కానున్నాయి.

91 స్కూళ్లతో ప్రతిపాదనలు

జిల్లాలో 21 మండలాల పరిధిలోని 589 గ్రామపంచాయతీలతో పాటు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీల్లో మొత్తం 1,190పాఠశాలు ఉన్నాయి. పీఎం శ్రీ పథకానికి నిర్దేశించిన నిబంధనల ప్రకారం 91పాఠశాలలను జిల్లా విద్యాశాఖ ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదించింది. ఇందులో నుంచి మండలానికి రెండు చొప్పున 42 పాఠశాలలను కేంద్రప్రభుత్వం ఎంపిక చేసే అవకాశముంది.

మార్కుల ఆధారంగా ఎంపిక

తొలుత జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపించేందుకు గాను పాఠశాలలను ఎంఈఓలు, పీజీ హెచ్‌ఎంల నేతృత్వంలోని బృందాలు పరిశీలించాయి. మొత్తంగా 267 పాఠశాలల నుంచి దరఖాస్తులు అందగా... గ్రామీణ ప్రాంతాల్లో 60శాతానికిపైగా మార్కులు, అర్బన్‌లోనైతే 75శాతానికిపైగా మార్కులు వచ్చిన 91 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటి వివరాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

ఐదేళ్లు... ఏటా 40లక్షలు

పీఎం శ్రీ పథకానికి ఎంపికైన పాఠశాలలకు ఏడాదిగా రూ.40లక్షల రూపాయల చొప్పున ఐదేళ్ల పాటు కేంద్రప్రభుత్వం అందించనుంది. మొత్తంగా అందే రూ.2కోట్లతో అత్యాధునికమైన సౌకర్యాలతో విద్యార్థులకు మెరుగైన అందించే అవకాశముంది. ఈ నిధులతో పాఠశాలల్లో సౌర విద్యుత్, ఎల్ఈడీ విద్యుత్ దీపాల ఏర్పాటు, పెరటితోటల పెంపకం, ప్లాస్టిక్ రహిత నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ బొమ్మలతో బోధన, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో ఎదుగుదలకు కృషి చేయనున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



పీఎం శ్రీ కార్యక్రమానికి సంబంధించిన ప్రతిపాదనలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదించాం. 21 మండలాల సంబంధించి 91 పాఠశాలలను ఎంపిక చేసి వివరాలు ఇచ్చాం. మండలానికి రెండు చొప్పున 42 పాఠశాలలను ఎంపిక చేసే అవకాశం ఉంది.

– రామకృష్ణ, సెక్టోరియల్ ఆఫీసర్, ఖమ్మం

బడ్జెట్‌పై ఎవరేం అన్నారంటే...

శాసనసభలో సోమవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జిల్లాలోని అధికార, విపక్ష పార్టీల నాయకుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

– ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం సహకారనగర్

మాటల్లోనే మెరుపులు



రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మాటల్లోనే మెరిసేలా బడ్జెట్ ప్రవేశపెట్టారు. నిరుద్యోగ సమస్య పరిష్కారంపై స్పష్టత లేదు. ఉద్యోగ ఖాళీలను ఎలా భర్తీ చేస్తారో చెప్పలేదు. పేద, మధ్యతరగతి వర్గాలు, మహిళా సాధికారత, బీసీ వర్గాలు, ఆదివాసుల సంక్షేమంపై దృష్టి సారించలేదని అర్థమవుతోంది.

– పోటు రంగారావు, రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా

నిరుద్యోగ భృతి, రుణమాఫీపై స్పష్టత లేదు..



నిరుద్యోగ భృతి ఊసెత్తకపోగా, రుణమాఫీపై స్పష్టత లేదు. దళితబంధుకు గత బడ్జెట్‌లో కేటాయించిన మొత్తమే ఖర్చు కాలేదు. ఈ ఏడాది కేటాయింపులు ఆశించిన రీతిలో లేవు. జిల్లాలో భారీ ప్రాజెక్టులకు నిధులు సరిగ్గా కేటాయించలేదు. ఇకపోతే సంఘటిత, అసంఘటిత వర్గాలకు మేలు జరిగేలా కేటాయింపులు లేవు. – పోటు ప్రసాద్, జిల్లా కార్యదర్శి, సీపీఐ

కేటాయింపులు సరే.. ఖర్చు?



బడ్జెట్‌లో కేటాయింపులు భారీగానే ఉన్నా ఖర్చుపై అనుమానాలు వస్తున్నాయి. గత బడ్జెట్‌లో ఏ అంశానికి పూర్తి స్థాయిలో కేటాయింపులు చేయలేదు. రుణమాఫీపై ప్రతిపాదన రైతాంగాన్ని నిరాశపర్చింది. సాగునీటి ప్రాజెక్టులకు తక్కువగా కేటాయించడంతో మరో పదేళ్లయినా పూర్తయ్యే పరిస్థితి లేదు.

– బాగం హేమంతరావు, రైతు సంఘం నాయకుడు

ఉపాధి కల్పనలో విఫలం



రాష్ట్ర బడ్జెట్‌తో సామాన్యులకు ఒరిగేదేమీ లేదు. దళితబంధుతో దళితుల జీవన స్థితిగతులలో మార్పు వస్తుందని భావిస్తే తక్కువ నిధులే కేటాయించారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పన ఊసెత్తకపోగా, రైతులకు ఉచిత ఎరువుల హామీ ప్రస్తావనే లేదు. ఇక జిల్లాలోని ప్రాజెక్టులకు కూడా అరకొరగానే నిధులు కేటాయించారు. – లక్కినేని సుధీర్‌బాబు, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌టీపీ

రూ.5లక్షలు ఇవ్వాలి



బడ్జెట్ కేటాయింపులు బాగున్నాయి. కానీ గత బడ్జెట్‌ను పరిశీలిస్తే వ్యయంపై అనుమానాలు కలుగుతున్నాయి. ఉన్నంతలో వ్యవసాయ, సంక్షేమ రంగాలకు కేటాయింపులు పర్యాలేదు. రైతు రుణమాఫీ హామీని వడ్డీతో సహా నెరవేర్చాలి. డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు రూ.3లక్షలు కాకుండా రూ.5 లక్షలు ఇవ్వాలి.

– నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి, సీపీఎం

సంక్షేమానికి ప్రాధాన్యత



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లుగా కనిపించింది. మౌలిక సదుపాయాలు, మధ్య తరగతి, దిగువ, బడుగు, బలహీనవర్గాల సంబంధించిన పథకాలకు కేటాయింపులు పెంచారు. ఏదిఏమైనా సమతుల్యత పాటించిన బడ్జెట్‌గానే చెప్పవచ్చు. – ఎస్.వెంకన్న, ఎకనామిక్స్ లెక్చరర్, ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల

పనుల్లో ఆలస్యంపై కమిషనర్ అసంతృప్తి



సమీకృత మార్కెట్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మం మయూరిసెంటర్: అభివృద్ధి పనుల్లో ఆలస్యం జరుగుతున్నా అధికారులు ఎందుకు పర్యవేక్షించడం లేదని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని గోళ్లపాడు ఛానల్, సమీకృత వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ప్రకాశ్‌నగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ పార్క్‌లో పనులపై ఆరా తీసిన ఆయన మరో నాలుగు రోజుల్లో ప్రారంభించాల్సి ఉన్నా ఇప్పటికీ పూర్తి చేయకపోవడం సరికాదన్నారు. ఇకనైనా పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ అధికారులు స్పందించి కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకురావాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ఈనెల 10న మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్న పనులన్నింటినీ 9లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

జిల్లాకు ప్రత్యేక అధికారి



డీఈఓకు సూచనలు చేస్తున్న జిల్లా పరిశీలకులు రమణకుమార్

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి జిల్లాకు ప్రత్యేక అధికారిని నియమించిన టీఎస్ఆర్ఈఐ కార్యదర్శి రమణకుమార్ సోమవారం ఖమ్మం వచ్చారు. ఈసందర్భంగా డీఈఓ సోమశేఖర్ శర్మతో సమావేశమై వివరాలు ఆరా తీయడంతో పలు సూచనలు చేశారు. కాగా, పదోన్నతులు, బదిలీల్లో తమకు అవకాశం కల్పించాలని భాషా పండితులు, పీఈటీలు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. జేఏసీ బాధ్యులు ఉమాదేవి, సుచరిత, అన్నపూర్ణ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొనగా, డీఈఓ శర్మకు వినవిపత్రం అందజేశారు.

బేతుపల్లి రెవెన్యూపై ఆర్డీఓ విచారణ

11 ఎకరాలకు నాలా కన్వర్షన్ అయినట్లు గుర్తింపు



విచారిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ

సత్తుపల్లి: మండలంలోని బేతుపల్లిలో సర్వే నంబర్ 133లో వివాదాస్పద భూములపై విచారణ కొనసాగుతోంది. ఈమేరకు కల్లూరు ఆర్డీఓ కె.సూర్యనారాయణ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. గంగారానికి ముచ్చపల్లి సత్యనారాయణ తనకు సమయమంతుల సాంబశివరావు నాలుగు కుంటల భూమిని అగ్రిమెంట్ చేయగా.. ఆ భూమిని సమయమంతుల హరికృష్ణ పేరిట బదలాయించి ఇళ్లు కడుతున్నాడని ఫిర్యాదు చేశాడు. అలాగే, మహదేవ సూరిబాబు పేరిట భూమి లేకపోయినా ఇతరులకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని మేడిశెట్టివారిపాలెంకు చెందిన లేళ్ల అప్పిరెడ్డి ఫిర్యాదు చేశాడు. ఈసందర్భంగా వివాదాస్పద భూమిలో 11.18 ఎకరాల భూములకు నాలా కన్వర్షన్ అయినట్లుగా ఆర్డీఓ సూర్యనారాయణ ధ్రువీకరించారు. నలుగురు పేరిట నాలా కన్వర్షన్ అయిందని విచారణలో తేలగా, భూమి లేకున్నా పాస్‌పుస్తకాలతో రిజిస్ట్రేషన్లు చేయటం చట్టవిరుద్ధమని తెలిపారు. సుమారు 20 మంది వరకు బేతుపల్లి రెవెన్యూలో ఇలాంటి అక్రమాలకు పాల్పడినట్టు ప్రాథమిక విచారణలో తేలిందని చెప్పారు. ఇందులో ఏడుగురికి నోటీసులు జారీ చేయగా ఐదుగురు వాంగ్మూలం ఇచ్చారని ఆర్డీఓ తెలిపారు. కాగా, కోర్టు విచారణలో ఉన్న భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ జరిగినట్టు తేలితే వాటిని రద్దు చేస్తామని వెల్లడించారు. కాగా, ఈ అంశంపై అభ్యంతరాలు ఉన్నవారు మంగళవారం కల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చని ఆర్డీఓ సూచించారు.

ఇంటర్నల్ మార్కులపై తనిఖీలు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని అన్ని యజమాన్యాల పరిధి పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులపై సోమవారం నుంచి తనిఖీలు ప్రారంభమయ్యాయి. ఈమేరకు జిల్లాలో 57బృందాలను నియమించగా, పాఠశాలల వారీగా వెళ్లి సమాధాన పత్రాలతో పాటు హాజరు పట్టికలను తనిఖీ చేస్తున్నారు. అలాగే, విద్యార్థుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తుండగా, తొలిరోజు 180 పాఠశాలలో తనిఖీ చేసినట్లు డీసీఈబీ కార్యదర్శి నారాయణ తెలిపారు.



పాఠశాలలో తనిఖీ చేస్తున్న బృందం

నేడు జిల్లాలో మంత్రి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఏర్పాటుచేసే కంటి వెలుగు శిబిరాన్ని మంత్రి పువ్వాడ ప్రారంభిస్తారు. ఆతర్వాత రఘునాథపాలెం మండలంలోని వేపకుంట్ల, గణేశ్వరం పాఠశాలల్లో మన ఊరు–మన బడి ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించనున్నారు.

మంత్రికి జర్నలిస్టు సంఘాల కృతజ్ఞతలు

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వనున్నట్లు ప్రకటించిన రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు జర్నలిస్టు సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం హామీ ఇచ్చిన నెలలోగా పట్టాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సీఎం కేసీఆర్, మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్‌కు సంఘాల బాధ్యులు ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

నిష్పక్షపాతంగా విచారణ జరపాలి



ఖమ్మంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ ఆధ్వర్యాన ర్యాలీ, ధర్నా

ఖమ్మంఅర్బన్: ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా అదానీ గ్రూప్‌లో పెట్టుబడులపై కేంద్రప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపించి సామాన్య, మధ్యతరగతి ప్రజలు నష్టపోకుండా చూడాలని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఖమ్మంలో సోమవారం ర్యాలీ నిర్వహించి రోటరీనగర్ ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షుడు దుర్గాప్రసాద్, మహ్మద్ జావేద్, పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ కోట్లాది మంది ప్రజల కష్టార్జితమైన సొమ్మే కాకుండా ప్రభుత్వ రంగ సంస్థల సొమ్మును మార్కెట్ విలువ కోల్పోతున్న కంపెనీల్లో పెట్టుబడులు పెట్టించిన అంశంపై పార్లమెంట్‌లో చర్చించాలన్నారు. ప్రధాని మోదీ తన స్నేహితుడైన అదానీకి సాయం చేయాలనే ఉద్దేశంతోనే అదానీ గ్రూప్‌లో ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా బలవంతంగా పెట్టుబడులు పెట్టించారని ఆరోపించారు. ఇప్పటికే కేంద్రప్రభుత్వం తీరు మార్చుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు పుచ్చకాయల వీరభద్రం, వడ్డే నారాయణరావు, మాలోత్ రాందాస్‌నాయక్, దొబ్బల సౌజన్య, బొడ్డు బొందయ్య, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వరరావు, పల్లెబోయిన భారతి చంద్రం, లకావత్ సైదులునాయక్, జెడ్పీటీసీ బానోతు వెంకటప్రవీణ్‌కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'గిరి వికాసం'తో చిన్నారుల అభివృద్ధి

- ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు
- బోధన పరిశీలన, గిరిజన దర్బార్‌లో వినతుల స్వీకరణ



గిరి వికాసం పాఠశాలలో బోధనను పరిశీలిస్తున్న పీఓ గౌతమ్

భద్రాచలం: బధిరుల కోసం ఏర్పాటు చేసిన 'గిరి వికాసం'తో మెరుగైన మార్పు వచ్చేలా బోధన సాగాలని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భద్రాచలంలో నడుస్తున్న గిరి వికాసం పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బోధనా తీరు, చిన్నారులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించాక ఆయన మాట్లాడారు. చిన్నారులకు అర్థమయ్యే రీతిలో బోధన జరపాలని సూచించారు. అలాగే, వారిని కంటికి రెప్పలా కాపాడుతూ అన్ని రకాలుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ప్రతినెల వైద్య శిబిరాలు, సదరం క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్ఓ ప్లాంట్ కోసం రూ.4.50 లక్షలు, నీటి సరఫరా కోసం మరో రూ.5 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కాగా, బోధన గదిలో సౌండ్ ప్రూఫ్ బోర్డులు, చదువుకు సంబంధించిన పెయింటింగ్‌లు వేయించాలని పీఓ సూచించారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించండి

గిరిజన దర్బార్‌లో గిరిజనులు వెల్లడించే సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని పీఓ గౌతమ్ పొట్రు ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన దర్బార్‌లో భాగంగా ఆయన గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరించి యూనిట్ అధికారులకు సూచనలిచ్చారు. కార్యక్రమాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ రమాదేవి, ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓ నర్సింగ్‌రావుతో పాటు అధికారులు అరుణకుమారి, అనిత, హరీశ్, కృష్ణవేణి, అరుణ, పద్మ, ప్రియాంక, తానాజీ, సురేశ్‌బాబు, భాస్కర్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

'దంరో' షోరూం ఏర్పాటు అభినందనీయం



షోరూంను ప్రారంభిస్తున్న మేయర్ నీరజ, పక్కన వనజీవి రామయ్య, సంస్థ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: మహానగరాలకు దీటుగా ఖమ్మంలో దంరో ఫర్నీచర్ షోరూం ప్రారంభించడం అభినందనీయమని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి సమీపాన ఏర్పాటుచేసిన షోరూంను పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి దరిపల్లి రామయ్య, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, ప్రతినిధులు చిరుమామిళ్ల రవికుమార్, అజిత్ పత్రివసన్, అమల్ ప్రియాంతతో కలిసి మేయర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ షోరూం ఏర్పాటుతో అత్యాధునిక ఫర్నీచర్ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. సంస్థ ఎండీ అజిత్ పత్రివసన్ మాట్లాడుతూ ఖమ్మం షోరూం సౌత్ ఏసియాలో పెద్దదని, ఇక్కడ అన్ని రకాల గృహోపకరణాలు లభిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొక్కుల వెంకటేశ్వర్లు, మాధవి, ఊహిత, బత్తుల మురళి, కమర్తపు మురళి, వత్సవాయి రవి, కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, తూముల పణ్యవతి, పోట్ల నాగేశ్వరరావు, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు అఫ్జల్ హసన్‌తో పాటు, ఉమామహేశ్వరరావు, పూర్ణచంద్రరాజు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.20.40లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మంలీగల్: ఖమ్మం వైస్సార్ కాలనీకి చెందిన కొల్లి శ్రీను, పార్వతి 22 మందిని ప్రతివాదులుగా చేరుస్తూ రూ.20.40 లక్షలకు గాను సోమవారం దివాలా పిటిషన్(ఐపీ) దాఖలు చేసినారు. కిరాణం షాపు నడిపే శ్రీను, పార్వతి పలువురి అప్పులు చేయగా, తీర్చలేని పరిస్థితి ఎదురైందని చెబుతూ స్థానిక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారందివాళా పిటిషన్ దాఖలు చేశారు.

నెట్ కేఫ్ యజమాని...

నగరంలోని బుర్హాన్‌పురానికి చెందిన దండుబోయిన లక్ష్మణరావు ఆరుగురిని ప్రతివాదులుగా చూపిస్తూ రూ.11.25 లక్షలకు దివాలా పిటిషన్ ధాఖలు చేశాడు. 2015లో శ్రీ తిరుమల నెట్ కేఫ్ ప్రారంభించిన ఆయన పలువురి వద్ద అప్పులు చేశాడు. అయితే, నష్టం రావడంతో స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఐపీ దాఖలు చేశాడు.

వైన్స్ వద్ద ఘర్షణ.. కత్తితో దాడి

ఖమ్మంఅర్బన్: నగరంలోని బల్లేపల్లిలో వైన్స్ వద్ద జరిగిన ఘర్షణ కత్తితో దాడి చేసుకునే వరకు వెళ్లింది. ఈ మేరకు సోమవారం ఖమ్మం అర్బన్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. సీఐ రామకృష్ణ కథనం ప్రకారం.. బల్లేపల్లికి చెందిన వరకాల సాయికుమార్, చిర్రా రవికుమార్ ఆదివారం రాత్రి వైన్స్ వద్ద ఘర్షణ పడ్డారు. ఈ విషయాన్ని సాయి తన సోదరుడు నాగరాజుకు చెప్పడంతో ఆయన ప్రశ్నిస్తుండగా కూరగాయల వ్యాపారం చేసే రవికుమార్ కత్తితో నాగరాజుపై దాడి చేశాడు. దీంతో రవికుమార్ ఫిర్యాదు మేరకు రవికుమార్, ఆయనకు సహకరించిన రాజేష్‌పై కేసు నమోదు చేశారు.